TEL:T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

పబ్లిషర్ : హైదరాబాద్ సంపుటి :01 సంచిక : 142 మంగళవారం 14-01-2025 పేజీలు :06 వేల : 05/-

# తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ సంక్రాంతి గొప్ప పండుగ




- ◈ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ సంక్రాంతి గొప్ప పండుగ
- ◈ నాలుగు సంక్షేమ పథకాలకు 45 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం
- ◈ ఎక్కడ,ఎవరికి,ఎలాంటి అనుమానాలు లేకుండా లోతుగా చర్చించిపథకాలు రూపొందించాము
- ◈ గ్రామ సభలోనే లబ్ధిదారుల ఎంపిక, అనుమతి పత్రాల మంజూరు
- ◈ సంక్షేమ పథకాల అమలులో ఇందిరమ్మ కమిటీలది కీలకపాత్ర
- ◈ రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల పేర్లు, నగదు మొత్తము వివరాలు గ్రామాల్లో భారీ ఫ్లెక్సీలు పెట్టి ప్రచారం చేయాలి
- ◈ లబ్ధిదారుల తుది జాబితాకు ఇన్చార్జి మంత్రి ఆమోదం తప్పనిసరి

**హైదరాబాద్ (మన వెలుగు) జనవరి 13 :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ సంక్రాంతి గొప్ప పండుగలా చరిత్రలో నిలిచిపోతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాల అధికారులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగిన నాలుగు కొత్త సంక్షేమ పథకాల అమలు సమీక్ష సమావేశము లో డిప్యూటీ సీఎం మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఆయన అన్నారు. ఇప్పటికే ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు రవాణా, 500 కే గ్యాస్ సిలిండర్, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచడం, యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మాణం, హాస్టల్ విద్యార్థులకు 40 శాతం డైట్, 200% కాస్మోటిక్స్ చార్జీలు పెంచడం, వరి ధాన్యానికి 500 బోనస్ వంటి చారిత్రాత్మక పథకాలు ఈ రాష్ట్రంలో అమలు అవుతున్నాయి అన్నారు. వీటితో పాటు ఈ సంక్రాంతి నుంచి అతి ముఖ్యమైన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి నాలుగు పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెస్తుంది అన్నారు. ఈ నాలుగు పథకాల అమలుకు సుమారు 40 నుంచి 45 వేల కోట్ల అధిక భారం రాష్ట్ర ఖజానాపై పడుతుంది అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు ముందుకు వెళుతుంది అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 22,500 కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కు 2000 కోట్లు, రైతు భరోసా కు 19 వేల కోట్లు చొప్పున ఖర్చు చేసుకుంటూ ముందుకు పోతామని తెలిపారు. ఈ నాలుగు కొత్త పథకాల అమలులో ఎక్కడ ఎవరికి సందేహాలు అవసరం లేదని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక, అమలుకు సంబంధించి విధి విధానాలు లోతుగా చర్చించిన తర్వాతే రాష్ట్ర క్యాబినెట్ ప్రకటన చేసిందని తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన భూములన్నిటికీ పరిమితి లేకుండా ఎకరాకు సంవత్సరానికి 12 వేల రూపాయల చొప్పున రైతుల ఖాతాలో జమ చేస్తాం అన్నారు. ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు పొందిన రైతులకు కూడా ఈ పథకం వర్తిస్తుంది అన్నారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా, వ్యవసాయ శాఖ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డు తీసుకున్న కుటుంబం కనీసం 20 రోజులు పని చేసి ఉండి సెంటు భూమి కూడా లేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అందుతుందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సైతం పూర్తిగా అర్హులనే ఎంపిక చేస్తాం అన్నారు. ఇచ్చిన మాట మేరకు దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా రెండు నెలల వ్యవధిలో రైతు రుణమాఫీ కింద రైతుల ఖాతాల్లోకి 22 వేల కోట్లు జమ చేసినప్పటికీ పెద్దగా ప్రచారం జరగలేదు. ఈ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నెల నుంచి అమలు చేయబోయే నాలుగు కొత్త పథకాలకు గ్రామ సభలు ఏర్పాటు చేసి అందరికీ తెలిసే విధంగా పథకాలు అందజేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక, ఖరారు జరుగుతుంది. గ్రామసభల్లోని అర్హులైన వారికి ఈ నాలుగు పథకాల అనుమతి పత్రాలు అధికారులు, ప్రజా ప్రతినిధులు అందజేస్తారు అని తెలిపారు.ప్రభుత్వ జీవో ప్రకారం సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయా లేదా అనేది ఇందిరమ్మ కమిటీలు పర్యవేక్షిస్తాయి, ఇందిరమ్మ కమిటీలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించాలి, సంక్షేమ పథకాల అమలులో వీరు కీలకం అని డిప్యూటీ సీఎం తెలిపారు. ఒక మండలాన్ని మూడు భాగాలుగా విభజించుకుని గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. గ్రామ సభ నిర్వహణ సమయంలో మంచి వేదిక, మైక్ సెట్, అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఉండాలన్నారు. లబ్ధిదారుల గుర్తింపు, అర్హుల జాబితా అన్నీ కూడా జిల్లా ఇన్చార్జి మంత్రి ఆమోదం ఉండాల్సిందే అని తెలిపారు.రైతు రుణమాఫీ పథకం కింద గ్రామంలో లబ్ధి పొందిన రైతుల పేర్లు, వారు పొందిన లబ్ధి నగదు మొత్తం వివరాలను ఒక ఫ్లెక్సీ పై వేసి గ్రామ సెంటర్లో ప్రదర్శించాలన్నారు. ఇదే తరహాలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల పేర్లు, వారు పొందిన నగదు మొత్తాన్ని అందరికీ కనిపించేలా పెద్ద అక్షరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని. మొత్తం మూడు పథకాలకు సంబంధించి మూడు ఫ్లెక్సీలు, విడివిడిగా పెద్దగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకాల అమలులో కలెక్టర్లకు ఎలాంటి సందేహాలు ఎదురైనా జిల్లా ఇన్చార్జి మంత్రితో మాట్లాడి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

# భారతీయ కంపెనీలే లక్ష్యంగా మాస్కోపై అమెరికా తాజా ఆంక్షలు



**వాషింగ్టన్ :** రష్యా ఇంధన రంగానికి వ్యతిరేకంగా ప్రకటించిన తాజా చర్యలో భాగంగా అమెరికా, బ్రిటన్‌లు రెండు భారతీయ కంపెనీలను నిషేధించాయి. తాజా ఆంక్షలతో మరింత ఆజ్యం పోసినట్టయిందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్, బ్రిటీష్ ప్రభుత్వం చేపట్టిన ఈ భారీ చర్యలు రెండు ప్రధాన రష్యన్ పెట్రోలియం ఉత్పత్తిదారులైన గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సుర్గుట్‌నెఫ్టెగాజ్, వాటి అనుబంధ సంస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. రష్యన్ ముడి చమురును రవాణా చేసే 183 నౌకలపై ఆంక్షలు కూడా ఉన్నాయి. జాబితాలో ఉన్న రెండు భారతీయ సంస్థలు స్కైహార్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్, అవిషన్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్. యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటన ప్రకారం.. ఈ కంపెనీలు రష్యా ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ 2 ప్రాజెక్టుకు మద్దతునిచ్చాయి. ఇది దేశంలోని అతిపెద్ద ధ్రువీకృత సహజ వాయువు ఉత్పత్తిదారు నోవాటెక్ యాజమాన్య అభివృద్ధిలో పాక్షికంగా ఉన్నది. ఈ ప్రాజెక్ట్ 2023 నుంచి అమెరికా ఆంక్షల కింద ఉంది. ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ 2 ప్రాజెక్ట్ కు భౌతికంగా సహాయం చేయడం లేదా మద్దతు అందించడం కోసం రెండు కంపెనీలను ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ 14024 కింద నియమించారు.

2లో

# ఇజ్రాయిల్ దాడులతో గాజా విద్యావ్యవస్థ నిర్వీర్యం



**ఇస్లామాబాద్ :** గాజాలో మొత్తం విద్యావ్యవస్థను ఇజ్రాయిల్ నిర్వీర్యం చేసిందని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మలాలా యూసఫ్‌జా ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ముస్లిం దేశాలలో బాలికల విద్య' పేరుతో పాక్‌లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సులో ఆదివారం ఆమె ప్రసంగించారు. ఈ సదస్సుకు పలు దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ.. గాజాలో అన్ని యూని వర్సిటీలను ఇజ్రాయిల్ బాంబులేసి నాశనం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. 90 శాతానికి పైగా పాఠశాలలను ధ్వంసం చేసిందని, పాఠశాల భవనాల్లో ఆశ్రయం పొందుతున్న పౌరులపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడిందని వివరించారు. ఇజ్రాయిల్ మానవహక్కుల, అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనలను తాను ప్రశ్నిస్తూనే ఉంటానని అన్నారు.

2లో

# పశ్చిమ దేశాల ఆంక్షలకు తిరస్కృతి

**కారకస్:** వెనిజులా ప్రభుత్వ ఉన్నతాధికారులపై అమెరికా , యూరోపియన్ యూనియన్ (ఇయు), బ్రిటన్ తాజాగా ఆంక్షలు విధించడాన్ని బొలివేరియన్ సాయుధ బలగాలు (ఎఫ్ఎఎన్‌బి) తిరస్కరించాయి. సామ్రాజ్యవాద దేశాల గూడు పుఠాణికి ఇది నిలువెత్తు నిదర్శనమని ఎఫ్ఎఎన్‌బి విడుదలజేసిన ప్రకటన పేర్కొంది. అధ్యక్షుడిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన నికోలస్ మదురో పట్ల సైన్యం తన తిరుగులేని విశ్వాసాన్ని ప్రకటించింది. ఈ ఆంక్షలు అంతర్జాతీయ న్యాయ నియమాలకు పూర్తి విరుద్ధమని పేర్కొంది. ప్రజలిచ్చిన తీర్పు మేరకే 2025-2031 కాలానికి వెనిజులా అధ్యక్షుడిగా మదురో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. వెనిజులా సార్వభౌమత్వంపైన, ప్రజాస్వామ్యంపైన శత్రువులు చేస్తున్న దాడిని వెనిజులా ప్రజలు తిప్పకొడతారని సైన్యం హెచ్చరిక చేసింది. సైన్యంలో నాయకత్వాన్ని అప్రతిష్ట పాల్జేసేందుకే ఈ



ఆంక్షలను విధించాయి. గత రెండు దశాబ్దాలుగా వెనిజులాకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదులు చేస్తున్న అన్ని యత్నాలను బొలివేరియన్ సైన్యం దృఢ సంకల్పంతో తిప్పికొడుతూ వస్తోంది. ఇప్పుడీ కుట్రలను అంతకు రెట్టించిన పట్టుదలతో వెనిజులా ఎదుర్కొంటుందని ఆ ప్రకటన పేర్కొంది. యూనిఫామ్‌లో ఉన్న సైనికులను రకరకాల ప్రలోభాలు, ఒత్తిళ్లు తెచ్చారని, అయినా వాటన్నిటిని తిరస్కరించి బొలివేరియన్ సాయుధ బలగాలు తమ నిబద్ధతను మరోసారి చాటిచెప్పాయి.

# భారతీయ కంపెనీలే లక్ష్యంగా

## మాస్కోపై అమెరికా తాజా ఆంక్షలు

అదనంగా, అవిజన్, ప్రవాసి.. ఒనిక్స్ నిర్వహించే రెండు నౌకలను కంపెనీకి సంబంధించిన ఆస్తిగా గుర్తించారు. ప్రాజెక్ట్ నుంచి సరుకును లోడ్ చేసే ధ్రువీకృత సహజ వాయువు వాహకాలను భారత కంపెనీలు నిర్వహించాయి. ఆర్కిటిక్ ఎల్ఎన్‌జీ 2 ప్రాజెక్ట్‌ను "పునరుజ్జీవింపజేసే ప్రయత్నంలో" "థర్డ్ కంట్రీ షిప్ మేనేజ్‌మెంట్ సంస్థల ద్వారా ఎల్ఎన్‌జీ వాహకాల యాజమాన్యాన్ని అస్పష్టం చేసే ప్రయత్నాలలో రష్యా నిమగ్నమైందని" అమెరికా అధికారులు పేర్కొన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో, ముంబయిలో నమోదు చేయబడిన రెండు భారతీయ ఆధారిత కంపెనీలు గోటిక్, ప్లియో ఎనర్జీపై వాషింగ్టన్ ఆంక్షలను విధించింది. ఇవి ప్రాజెక్ట్ తో అనుసంధానించబడి ఉన్నాయని పేర్కొన్నది. నోవాటెక్ ప్రాజెక్ట్ నుంచి ఎల్ఎన్‌జీని "ఎగుమతి చేసే ప్రయత్నాలకు" సంబంధం ఉందని ఆరోపిస్తూ ఈ కంపెనీల యాజమాన్యంలోని రెండు నౌకల పైన కూడా ఆంక్షలను విధించింది. గతేడాది అమెరికా ఒక ప్రత్యేక చర్యలో, రష్యన్ సంస్థలకు ఎలక్ట్రానిక్స్, విమానయాన భాగాలను సరఫరా చేసినందుకు 19 భారతీయ కంపెనీలు, ఇద్దరు జాతీయులపై ఆంక్షలు విధించింది. దీనికి ప్రతిస్పందనగా, ఆ కంపెనీలు దేశీయ చట్టాలను ఉల్లంఘించలేదనీ, భారతదేశ చట్టాల పరిధిలోనే పనిచేస్తున్నాయని భారత్ పేర్కొన్నది.

# ఇజ్రాయిల్ దాడులతో

## గాజా విద్యావ్యవస్థ నిర్వీర్యం

పాలస్తీనాలో పిల్లలు తమ జీవితాలను, భవిష్యత్తును కోల్పోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఓ పాలస్తీనా బాలిక చదువుకునే పాఠశాలపై బాంబు దాడిచేసి, ఆమె కుటుంబాన్ని హత్య చేస్తే ఆమెకి భవిష్యత్తు లేకుండా చేసినట్లేనని అన్నారు. ఆఫ్ఘన్‌లో తాలిబన్ ప్రభుత్వానికి చట్టబద్ధత కల్పించవద్దని, మహిళలు, బాలికల విద్యను అడ్డుకుంటున్న వారి చర్యలను వ్యతిరేకించాలని ముస్లిం నేతలను అభ్యర్థించారు. వాస్తవంగా చెప్పాలంటే మహిళలను మీగొంతుకను వినిపించాల్సిన సమయం వచ్చిందని, మీరు నిజమైన నాయకత్వాన్ని చూపాలని సూచించారు. అయితే ఈ కార్యక్రమానికి ఆఫ్ఘనిస్తాన్ ప్రతినిధులెవరూ హాజరుకాలేదు. వారికి అధికారికంగా ఆహ్వానం పంపినప్పటికీ సదస్సుకు రాలేదని పాకిస్తాన్ విద్యాశాఖ మంత్రి ఖలీద్ మక్బూల్ సిద్ధిఖీ వెల్లడించిన సంగతి తెలిసిందే.

# రిపబ్లిక్ డే ముఖ్య అతిథిగా సుబియాంటో



**న్యూఢిల్లీ:** ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో హాజరయ్యే అవకాశం ఉన్నట్టు పలు మీడియా వర్గాలు వెల్లడిస్తున్నాయి. 73 ఏళ్ల మాజీ ఆర్మీ జనరల్ సుబియాంటో 2024 అక్టోబర్‌లో ఇండోనేషియా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ పర్యటనలో ఆయన ఇరుదేశాల సంబంధాలపై ప్రధాని మోడీతో విస్తృత చర్చలు జరిపే అవకాశం ఉన్నట్టు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై అధికారిక ప్రకటన ఇంకా రావాల్సి ఉంది. గత ఏడాది ప్రబోవో ప్రధాని మోడీకి ఫోన్‌కాల్ చేసి.. ఇరుదేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు. నవంబర్‌లో బ్రెజిల్‌లోని రియో డి జనిరోలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో ప్రబోవో ప్రధాని మోడీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తో వాణిజ్యం, ఆరోగ్యం, భద్రత వంటి రంగాలలో సహకారంపై చర్చించారు.

# నిలంబూర్ ఎమ్మెల్యే పి.వి.అన్వర్ రాజీనామా



**తిరువనంతపురం :** కేరళలోని నిలంబూర్ నియోజకవర్గానికి చెందిన స్వతంత్ర ఎమ్మెల్యే పి.వి. అన్వర్ రాజీనామా చేశారు. సోమవారం కేరళ స్పీకర్ ఎ.ఎన్.శ్యాంసీర్‌కి తన రాజీనామా లేఖను అందజేశారు. కోల్‌కతా టిఎంసి నేతలతో సమావేశమైన కొద్ది రోజుల అనంతరం అన్వర్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.కేరళలో పార్టీ కార్యకలాపాలను సమన్వయం చేస్తానని అన్వర్ చెప్పారు. అయితే టిఎంసి సభ్యత్వాన్ని ఆమోదిస్తున్నారా లేదా అనే వివరాలను వెల్లడించకుండా దాటవేశారు. తన అసెంబ్లీ సీటును కోల్పోవడంతో పాటు ఫిరాయింపుల నిరోధక చట్టం కింద చట్టపరమైన చర్యలను తప్పించుకునేందుకు ఈ వివరాలను వెల్లడించకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. కేరళ స్టూడెంట్స్ యూనియన్ (కెఎస్‌యు) నేతగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన అన్వర్ కాంగ్రెస్‌లో చేరారు. 2005లో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి కె. కరుణాకరన్‌కి చెందిన డెమోక్రటిక్ ఇందిరా కాంగ్రెస్ (కరుణాకరన్)తో పొత్తు పెట్టుకున్నారు. అనంతరం ఎల్‌డిఎఫ్‌తో చేతులు కలిపారు. అధికార ఫ్రంట్ స్వతంత్ర అభ్యర్థిగా నిలంబూర్ నుండి రెండుసార్లు గెలిచారు.

# ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్



**రాయ్‌పూర్ :** దండకారణ్యంలో ఎదురుకాల్పులు నిత్యకృత్యంగా మారాయి. నెత్తుటి రుచి మరిగిన పులిలా ..తూటాలు గర్జిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో చోటుచేసుకున్న మరో ఎదురుకాల్పుల ఘటనలో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారు. వీరిలో ఇద్దరు మహిళలున్నారు. బీజాపూర్ జిల్లాలో ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలోని అడవుల్లో ఆదివారం ఉదయం భద్రతా సిబ్బంది మావోయిస్టుల ఏరివేత కార్యక్రమాన్ని చేపడుతుండగా ఈ ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయని బస్తర్ ఐజీ తెలిపారు. ఈ ఘటనలో ఐదుగురు మావోయిస్టులు చనిపోయారని తెలిపారు. గతేడాది వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 219 మంది మావోయిస్టులు చనిపోగా, . ఈ ఏడాది ప్రారంభంలో 12 రోజుల వ్యవధిలో 12 మంది మావోయిస్టులను భద్రతాబలగాలు పొట్టనపెట్టుకున్నాయి. దండకారణ్యంలో భద్రతా దళాలకు, మావోయిస్టులకు మధ్య జరుగుతున్న ఈ వార్ అక్కడి గిరిజనుల్లో తీవ్ర భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి.

# బిజెపి వాదనలన్నీ వట్టి మాటలే

## ఇదంతా మోడీ నియంతృత్వ పోకడల్లో భాగం



**న్యూఢిల్లీ :** దేశంలో వివాదాస్పద జమిలీ ఎన్నికలపై మోడీ సర్కారు ప్రత్యేక దృష్టిని సారించింది. తామనుకున్న 'ఒకే దేశం, ఒకే ఎన్నిక'ను ఎలాగైనా అమలు చేయాలని చూస్తున్నది. ఇందులో భాగంగా గత పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో దీనికి సంబంధించిన బిల్లును అనూహ్యంగా సభలోకి తీసుకొచ్చింది. దీనిపై కాంగ్రెస్, సిపిఎం సహా పలు ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. చివరకు, జమిలీ ఎన్నికలకు సంబంధించిన బిల్లులు జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి)కి వెళ్లాయి. ఇటీవలే జెపిసి తొలి సమావేశం కూడా వాడీవేడిగా జరిగింది. ప్రతిపక్ష సభ్యులు 'ఒకేదేశం, ఒకే ఎన్నిక'ను వ్యతిరేకిస్తూ తమ అభిప్రాయాలు చెప్పారు. ఇది సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందన్నారు. అధికారిక ఎన్డీఏ పక్షం ఎంపీలు మాత్రం బిల్లులను సమర్థించారు. జమిలీపై కేంద్రం ప్రధానంగా వినిపిస్తున్న మాట.. నిరంతర ఎన్నికలతో అభివృద్ధికి ఆటంకం, ఎన్నికల ఖర్చు. ఈ ఎన్నికల చక్రాన్ని నిరంతరం కాకుండా.. దేశమంతటా ఒకేసారి నిర్వహిస్తే భారత జిడిపి కూడా మెరుగుపడే అవకాశమున్నదని బిజెపి, దాని అనుబంధ సంఘాల నాయకులు, ఎన్‌డిఎలోని పార్టీలు వాదిస్తున్న మాట. అయితే, ఈ మాటలను మాత్రం రాజకీయ విశ్లేషకులు, నిపుణులు, మేధావులు కొట్టి పారేస్తున్నారు. జమిలీ ఎన్నికలతో అద్భుతాలేవీ జరగవని అంటున్నారు. బిజెపి చెప్తున్నట్టుగా డబ్బును ఆదా చేయటం, జిడిపిని మెరుగుపర్చటం వంటిది జరగదని చెప్తున్నారు. పైగా దేశ సమాఖ్య విధానానికి ఇది విఘాతం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు దేశాల్లో చోటు చేసుకున్న నియంతృత్వ పోకడలను అనుసరించటానికి మోడీ ప్రయత్నిస్తున్నారని అంటున్నారు.

# రైతు సంఘాలతో చర్చలు జరపండి



**న్యూఢిల్లీ :** ప్రజాస్వామ్యాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గౌరవించాలని, రైతు సంఘాలతో వెంటనే చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ గణతంత్ర దినోత్సవం (జనవరి 26) నాడు దేశవ్యాప్తంగా రైతు ట్రాక్టర్, వాహన, మోటార్ సైకిల్ పరేడ్ నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎస్‌కెఎం ఆదివారం ప్రకటన విడుదల చేసింది. "రైతు నాయకులు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడాలి. రైతు వ్యతిరేక, సమాఖ్య వ్యతిరేక ఎన్‌పిఎఫ్ఎఎంను ఉపసంహరించుకోవాలి. సి2 ప్లస్ 50తో కూడిన కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలి. విద్యుత్ ప్రైవేటీకరణ ఆపాలి. రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణ విముక్తికై రుణమాఫీ కోసం సమగ్ర పథకం అమలు చేయాలి. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి. 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలి. భూ సేకరణ పరిహారం, పునరావసం (ఎల్ఎఆర్ఆర్) చట్టం-2013ను అమలు చేయాలి" వంటి డిమాండ్లతో ఆ రోజు రైతు సంకల్ప కవాతు నిర్వహించనున్నట్లు తెలిపింది. అలాగే ఎస్‌కెఎం అన్ని రాష్ట్ర సమన్వయ కమిటీలు వెంటనే సమావేశమై వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన పత్రులను తగలబెట్టడంతో తీవ్ర నిరసన తెలియజేయాలని కోరింది. రైతు నాయకులు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కాపాడేందుకు సిద్ధపడని, రైతు సంఘాలతో చర్చలకు ఇష్టపడని ప్రధానమంత్రి నిరంకుశ వైఖరిని ఎస్‌కెఎం తీవ్రంగా ఖండించింది. దల్లేవాల్ ఆమరణ నిరాహార దీక్ష 46 రోజులు దాటినప్పటికీ, ఆయన ప్రాణాలను కాపాడటానికి సుప్రీంకోర్టు, రాష్ట్రపతి జోక్యం చేసుకోలేకపోయారని పేర్కొంది. రైతులకు కనీస మద్దతు ధర, కార్మికులకు కనీస వేతనం నిరాకరించడం, యువతకు ఉపాధిని నాశనం చేయడం ద్వారా వ్యవసాయం, పరిశ్రమలు, సేవలపై తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి మోడీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని, కార్పొరేట్ శక్తుల ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మోకరిల్లడమే దీనికి ప్రధాన కారణమని పేర్కొంది. రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలలో ఒకటైన ఫెడరలిజాన్ని కూడా దెబ్బతీస్తున్నారని విమర్శించింది.

# సిపిఎం జార్ఖండ్ రాష్ట్ర

## కార్యదర్శిగా ప్రకాష్ విప్లవ్ ఎన్నిక



న్యూఢిల్లీ : సిపిఎం జార్ఖండ్ రాష్ట్ర కార్యదర్శిగా ప్రకాష్ విప్లవ్ ఎన్నికయ్యారు. 35 మందితో రాష్ట్ర నూతన కమిటీ ఎన్నికయింది. అందులో 11 మందితో రాష్ట్ర కార్యదర్శి వర్గం ఎన్నికున్నారు. రాంచీ నామ్‌కుమ్‌లో మూడు రోజుల పాటు జరిగిన 8వ సిపిఎం జార్ఖండ్ రాష్ట్ర మహాసభ శనివారం ముగిసింది. ఈ మహాసభకు సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్, రామచంద్రడోమ్ హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి ప్రకాష్ విప్లవ్ రాజకీయ, నిర్మాణ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై ప్రతినిధులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. పార్టీ క్షేత్రస్థాయి బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిస్తూ ముగిసింది. ఈ సందర్భంగా బృందా కరత్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ సర్కార్ అవలంభిస్తోన్న కార్పొరేట్, హిందూత్వ బంధాన్ని వివరించారు. పోరాడి సాధించుకున్న అటవీ హక్కుల చట్టాన్ని మోడీ సర్కార్ నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని, ఇది గిరిజనులను తమ భూములను నుంచి దూరం చేయడమేనని స్పష్టం చేశారు. ఈ విధానాలపై పోరాటాలకు గిరిజనులను ఏకం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అటవీ భూములను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారని, సహజ వనరులను అప్పన్నంగా దోచి పెడుతున్నారని ధ్వజమెత్తారు. రామచంద్రడోమ్ మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. గిరిజనులను ఐక్యం చేయాలని, మోడీ సర్కార్ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని తెలిపారు.

